పొలిటికల్ టూరిస్ట్ రాజేందర్‌రావు

- దమ్ముంటే ప్రజల మధ్య ఉండడం నేర్చుకో
- కాంట్రాక్టుల పేరుతో దోచుకోవడం మానుకో
- మేయర్ సునీల్‌రావు ఫైర్

కార్పొరేషన్, ఆగస్టు 28: ఎన్నికల సమయంలో రావడం, పోటీ చేసి ఓడిపోవడం రాజేందర్‌రావుకు పరిపాటి అని, ఆయన ఒక పొలిటికల్ టూరిస్ట్ అని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు ఎద్దేవా చేశారు. ఈ మేరకు బుధవారం వాట్సాప్‌లో ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్త బిచ్చగాడు పొద్దు ఎరగడన్నట్టుగా కాంగ్రెస్ నాయకుడు వెలిశాల రాజేందర్‌రావు, తన అమెరికా పర్యటనపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తాము ఏడాదిలో 365 రోజులు కరీంనగర్‌లో ప్రజల మధ్య ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించే నిబద్ధత గల నాయకులమని పేర్కొన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ పంచన చేరి కాంట్రాక్టుల పేరుతో ప్రజా ధనాన్ని దోచుకోవడం, దాచుకోవడం మాత్రమే తెలిసిన వ్యక్తి రాజేందర్‌రావు అని విమర్శించారు. ఈ విద్య ఆయనకు తెలిసినంతగా మరెవరికీ తెలియదని మండిపడ్డారు. దోచుకొని దాచుకున్న డబ్బుతోనే ఎన్నికలు వచ్చిన ప్రతిసారి నగరానికి వచ్చి ఎన్నికల్లో నిలబడి ప్రజల చేత తిరస్కరించబడే వ్యక్తి రాజేందర్‌రావు అని విమర్శించారు. ఆయనకు తనపై విమర్శలు చేసే కనీస నైతిక అర్హత కూడా లేదన్నారు. రాజేందర్‌రావు ప్రజాసేవ చేయాలనుకుంటే ముందు ప్రజల మధ్య ఉండాలని హితవు పలికారు. కాంట్రాక్టుల పేరుతో దోచుకోవడం బంద్ చేయాలని పేర్కొన్నారు. దోచుకునే, దాచుకునే అలవాటు రాజేందర్‌రావుకు ఉంది కాబట్టే, ఆయన ప్రతి ఒక్కరూ అదే విధంగా ఉంటారని భావిస్తున్నారని, ఇది చాలా దురదృష్టకరమని పేర్కొన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉండి ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయడమే తమకు అలవాటన్నారు. రాజేందర్‌రావులా ప్రజల సొమ్మును దోచుకునే దాచుకునే నాయకులం కాదన్నారు. తమపై మరోసారి విమర్శలు చేసే ముందు వాస్తవాలేంటో తెలుసుకొని మాట్లాడితే చాలా మంచిదన్నారు. పసలేని విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

- కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్
- నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనుల పరిశీలన

నగరంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కార్పొరేషన్, ఆగస్టు 28: నగర ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ప్రస్తుతం వస్తున్న సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. జ్యోతినగర్ ప్రాంతంలో ఓ షాపు యజమాని చెత్తను డ్రైనేజీల్లో వేసినందుకు కమిషనర్ స్వయంగా రూ.వెయ్యి జరిమానా విధించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున పారిశుధ్యాన్ని మరింత మెరుగు పరుచాలన్నారు. డివిజన్లవారీగా రోడ్లు, ఇండ్ల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాలను శుభ్రం చేయించడంతో పాటు వర్షం నీరు నిలువకుండ చర్యలు తీసుకోవాలన్నారు. నీరు నిలిచిన చోట ఆయిల్ బాల్స్‌తో పాటు అవసరమైన చోట గంబూషియా చేపలను కూడ వేయాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా డివిజన్‌లో ఒక రోజు ఫాగింగ్ చేయించాలన్నారు. ప్రతి రోజు ఇంటింటి నుంచి చెత్త సేకరణ జరుగుతున్నదని, ఇండ్ల యజమానులు తడి, పొడి చెత్తను వేరు చేసి వారికి అందించాలని సూచించారు. ఇంటి చుట్టు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీరు నిల్వకుండ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వేణు మాధవ్, ఎస్సైలు, జవాన్లు పాల్గొన్నారు.

పరిశోధనకే జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు కె.ముత్యం

కార్పొరేషన్, ఆగస్టు 28: డాక్టర్ కే ముత్యం పరిశోధన కోసమే తన జీవితాన్ని అంకితం చేశారని, ఎంతోమంది విద్యార్థులను ప్రోత్సహించి పరిశోధకులుగా తయారు చేశారని ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై సత్యనారాయణ కొనియాడారు. ఇటీవల మృతి చెందిన కె.ముత్యం యాదిలో బుధవారం కళాశాల తెలుగు విభాగం తరపున నివాళి సాహిత్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కే ముత్యం స్వయంగా వ్యయ ప్రయాసలకోర్చి 28 పుస్తకాలను ప్రచురించారన్నారు. బహుభాషా కోవిదుడు నలిమెల భాస్కర్ మాట్లాడుతూ, కే ముత్యం పరిశోధనల్లో తనకు పాలుపంచుకునే అవకాశం ఇచ్చారని తెలిపారు. తెలంగాణ భాషా పరిశోధనలో తెలంగాణ మాండలికం కాదు, అది ఒక భాషా అని నిరూపించడానికి ముత్యం తనకు ప్రేరణ కల్పించారన్నారు. అన్నవరం దేవేందర్ మాట్లాడుతూ, తాను, ముత్యం కలిసి జనం గుర్తించని కమ్యూనిస్టు యోధుడు అయిన 'మేర మల్లేశం' గురించి పుస్తక రూపంగా తెచ్చామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, జీడీ రమేశ్, తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ బూర్ల చంద్రశేఖర్, కళాశాల అధ్యాపకులు డాక్టర్ బీ ప్రకాశ్, రాపర్తి శ్రీనివాస్, మెట్టు వెంకటేశ్వర్లు, డాక్టర్ పి. అశోక్, డాక్టర్ పి. చైతన్య, డాక్టర్ పి. అనిల్, కట్ట వేణు, ఎన్. మహేశ్, డిగ్రీ, పి.జి. విద్యార్థులు పాల్గొన్నారు.

యూపీఎస్‌ను తిరస్కరించాలి

కలెక్టరేట్, ఆగస్టు 28 : సీపీఎస్, ఓపీఎస్‌కు మధ్యేమార్గంగా కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన యూనిఫైడ్ పెన్షన్ స్కీంను సీపీఎస్ ఉద్యోగులంతా తిరస్కరించాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రతినిధి రాఘవులు పిలుపునిచ్చారు. యూపీఎస్ విధానం ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన పథకం కాదని స్పష్టం చేశారు. బుధవారం నగరంలోని ఆసంఘం కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమావేశంలో పాల్గొని, యూపీఎస్‌తో ఉద్యోగులకు జరుగనున్న నష్టంపై వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉద్యోగుల పెన్షన్ సంబంధితావసరాలను యూనిఫైడ్ పెన్షన్ స్కీం పూర్తిస్థాయిలో తీర్చలేని విధంగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యోగుల సంక్షేమం కోసం సమర్థవంతమైన విధానాలతో పథకం ఉండాలంటే పాత పెన్షన్ విధానమే పునరుద్ధరించాలన్నారు. సమావేశంలో సీపీఎస్ ఉద్యోగులు వెంకటయ్య, రాజమల్లు, రెహమాన్, శ్రీనివాస్ యాదవ్, ముక్కెర మల్లయ్య, కొండి రాములు, అజయ్ కుమార్, హర్షవర్ధన్, వీరయ్యతోపాటు పలువురు పాల్గొన్నారు.

పీఆర్సీ అమలులో నిర్లక్ష్యం వీడాలి

కలెక్టరేట్, ఆగస్టు 28 : రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు పే రివిజన్ కమిటీ చేసిన సిఫారసుల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని తెలంగాణ ప్రభుత్వోద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండి.రాజ్‌మహ్మద్ డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం విడుదల చేసిన డీఏలతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రకటించాల్సిన డీఏను కూడా పెండింగ్‌లో ఉంచడం ఉద్యోగుల సహనాన్ని పరీక్షించడమేనన్నారు. ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా బుధవారం పలు ప్రభుత్వ కార్యాలయాల్లోని ఉద్యోగులను కలిశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్ణయంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యల దృష్ట్యా సత్వరమే రెండు డీఏలు విడుదల చేయాలని, పీఆర్సీ అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఉద్యోగులను కలిసిన వారిలో సంఘ బాధ్యులు రఘుపతిరెడ్డి, విక్రమ్‌కుమార్, శైలేష్, రాజయ్య, రహీంపాషా తదితరులున్నారు.

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా కరుణాకర్‌రెడ్డి

సైదాపూర్, ఆగస్టు 28: మండలంలోని దుద్దనపల్లి గ్రామానికి చెందిన ఐలేని కరుణాకర్‌రెడ్డి పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పాటుపడుతానన్నారు. ఈ సందర్భంగా ఆయనను దుద్దనపల్లి మాజీ సర్పంచ్ తాటిపల్లి యుగేందర్‌రెడ్డి అభినందించారు.

స్వధార్ హోమ్ సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి

కలెక్టరేట్, ఆగస్టు 28 : నగరంలోని కార్ఖానాగడ్డ సమీపంలో గల ప్రభుత్వ వృద్ధాశ్రమం, స్వధార్ హోమ్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ బుధవారం సందర్శించారు. ఆశ్రమంలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులను కలిసి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్న దృష్ట్యా, వృద్ధులు, దివ్యాంగులకు సరైన వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు. స్వధార్ హోంలోని యువతులతో మాట్లాడుతూ, తాత్కాలిక ఆకర్షణకు లోనై జీవితాలను చిన్నాభిన్నం చేసుకోకూడదని హితవు పలికారు. తల్లిదండ్రుల కష్టాలను ప్రత్యక్షంగా చూస్తూ కూడా, వారికి తీరని వ్యథను మిగల్చడం సముచితం కాదన్నారు. విద్యార్థి దశలో ఎలాంటి వేధింపులకు గురైనా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తోటి మిత్రులకు తెలుపాలన్నారు. అనంతరం ఆహార పదార్థాలు నిలువ చేసే గదులు పరిశీలించారు. అంతకుముందు వృద్ధులు, దివ్యాంగులకు, స్వధార్ హోమ్‌లో ఆశ్రయం పొందుతున్న వారికి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ, స్వధార్ హోమ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ హాస్పిటళ్ల దోపిడీపై ఫిర్యాదు

విద్యానగర్, ఆగస్టు 28 : విష జ్వరాలతో జిల్లా ప్రజలు బాధపడుతుంటే పలు ప్రైవేట్ హాస్పిటళ్లలో దోపిడి ఎక్కువైందని, వాటిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో డీఆర్‌వోకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం, మాజీ కార్య నిర్వాహక కార్యదర్శి కల్యాడపు ఆగయ్య పాల్గొన్నారు.

అందరికీ సమాన గౌరవం కల్పించాల్సిందే

సమావేశంలో పాల్గొన్న పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

కలెక్టరేట్, ఆగస్టు 28 : రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం సమాజంలో జీవించే ప్రతి వ్యక్తికీ సమాన గౌరవం కల్పించాల్సిందేనని జిల్లా న్యాయసేవా సంస్థ ప్రతినిధి మల్లేశ్ స్పష్టం చేశారు. శివపార్వతి మహిళా పబ్లిక్ వెల్ఫేర్ సొసైటీ, సంగ్రామ్, డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని మైత్రి హోటల్‌లో సెక్స్ వర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ఆదేశాలు తూచా తప్పకుండా పాటించాల్సిందేనన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరినీ గౌరవించాల్సిందేనని, వారి అవసరాలు, ఆర్థిక సమస్యలు, ఇతర ఇబ్బందుల దృష్ట్యా వారికిష్టమైన పనులు చేసుకోవడం ప్రజాస్వామ్యం కల్పించిన హక్కని గుర్తు చేశారు. సఖీ ఇన్‌చార్జి లక్ష్మి మాట్లాడుతూ, సెక్స్ వర్కర్ల సమస్యలు పరిష్కరించేందుకు సఖీ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెక్స్ వర్కర్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా తమకు సమాచారమిస్తే, వారికి అవసరమైన సాయమందించేందుకు సఖీ సిద్ధంగా ఉంటుందన్నారు. సమాచారమిచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ విజయవాణి, ఐసీపీఎస్ శాంత, సీడబ్ల్యూసీ కళింగ శేఖర్, సంగ్రామ్ కోఆర్డినేటర్ వీణ, 1098 ఆవుల సంపత్, గణేశ్, గాయత్రి, స్వరూప, గొర్రె రాజయ్య తదితరులతో పాటు వంద మందికి పైగా సెక్స్‌వర్కర్లు, ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 28: సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేస్తూ వెంటనే రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో ఆ సంఘం జేఏసీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ఒక్క రోజు నిరసన దీక్ష చేపట్టారు. ముందుగా తెలంగాణ చౌక్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ, గతేడాది సెప్టెంబర్ 13న హనుమకొండలో తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్ష శిబిరాన్ని పీసీసీ అధ్యక్షుడి హోదాలో సందర్శించిన రేవంత్ రెడ్డి, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వెంటనే సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన దీక్షలో సమగ్ర శిక్షా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై అవగాహన

తిమ్మాపూర్ రూరల్, ఆగస్టు 28: మండలకేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో బుధవారం అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్ ఓటర్ల జాబితా, హౌస్ టూ హౌస్ సర్వేపై బీఎల్‌వోలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని తెలిపారు. అనంతరం అల్గునూర్‌లోని సీవోఈ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీవో విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE

★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.

NT- 326217

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571

9182 777 189

పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

హుజూరాబాద్ రూరల్, ఆగస్టు 28: పెద్దపాపయ్యపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈవో జనార్దన్ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర గవర్నర్, సీఎం, విద్యాశాఖ మంత్రి, కలెక్టర్, ఇతర అధికారుల పేర్లు అడిగి.. ఉన్నత పాఠశాలలో ఉన్న ఐఎఫ్‌పీ(ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్)ని ప్రతి విద్యార్థి చాలా చక్కగా వినియోగించడంపై హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువులో ప్రతిభ చూపాలని కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

పోయిన ఫోన్ అప్పగింత

చొప్పదండి, ఆగస్టు 28: పట్టణానికి చెందిన శంకర్ అనే వ్యక్తి పది రోజుల క్రితం తన రూ. 22 వేల విలువగల శాంసంగ్ ఫోన్ పోగొట్టుకున్నాడు. చొప్పదండి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, వెంటనే పోగొట్టుకున్న ఫోన్‌ను టెక్నాలజీ ద్వారా వెతికి పట్టుకొని బాధితుడికి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో కేసుల నమోదు

పట్టణంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని ఓనర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనూష తెలిపారు. అలాగే, పట్టణంలోని ఒక దాబాలో యువకులను మద్యం తాగేందుకు అనుమతించడంపై ఓనర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

కారు ఢీకొని బాలుడికి గాయాలు

రామడుగు, ఆగస్టు 28 : రాంచంద్రాపూర్ ఎస్సీ కాలనీవద్ద బుధవారం సాయంత్రం కారు ఢీకొని ఎల్‌కేజీ చదివే బాలుడు గాయపడ్డాడు. మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివే చిన్నారి సాయంత్రం పాఠశాల బస్సులో వచ్చి రాంచంద్రాపూర్‌లో దిగి రోడ్డు దాటుతుండగా, గోపాల్‌రావుపేట నుంచి కరీంనగర్ వెళ్తున్న కారు ఢీకొట్టడంతో స్వల్పంగా గాయపడ్డాడు. వెంటనే జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. బాలుడికి పూర్తి వైద్యపరీక్షలు నిర్వహించి, ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు నిర్ధారించినట్టు గ్రామస్తులు తెలిపారు.

వృత్తివిద్యలో నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

మాట్లాడుతున్న రమేశ్‌రెడ్డి

తిమ్మాపూర్, ఆగస్టు 28: ఎల్ఎండీ కాలనీలోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ కోర్సుల్లో నూతనంగా ప్రవేశం పొందిన బీటెక్ ఫస్ట్‌ఇయర్ స్టూడెంట్స్‌కు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వృత్తి విద్యలో నైపుణ్యాలు పెంపొందించుకుని కళాశాల క్యాంపస్‌లోనే ఉద్యోగం సాధించవచ్చున్నారు. కళాశాల వసతులను సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ శశికాంత్, ఏవో రామారావు, లైబ్రేరియన్ గొంటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి



మాట్లాడుతున్న కళాశాల ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్ రెడ్డి

తిమ్మాపూర్ రూరల్, ఆగస్టు 28: రామకృష్ణ కాలనీలోని వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ యు.జి.సి అటానమస్‌లో బీటెక్ విద్యార్థులకు బుధవారం ఓరియెంటేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, కళాశాలలో చేరిన విద్యార్థులు నాలుగు సంవత్సరాలు పట్టుదలతో కష్టపడి చదివి టెక్నికల్, నాన్ టెక్నికల్, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల సంయుక్త కార్యదర్శి జి.శ్రీనివాస్ రెడ్డి, మెంబర్లు సీహెచ్ విశ్వనాథ్, వినోద్, ప్రకాశ్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్, వివిధ విభాగల విభాగాధిపతులు, అధ్యాపకులు, ప్రొఫెసర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎండీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

తిమ్మాపూర్, ఆగస్టు 28: లోయర్ మానేరు డ్యాంలోకి శ్రీ రాజరాజేశ్వర జలాశయం నుంచి నీటి విడుదల స్థిరంగా కొనసాగుతున్నది. రెండు రోజులుగా 14600 టీఎంసీల ఇన్‌ఫ్లో వస్తున్నది. 24టీఎంసీల సామర్థ్యం గల ఎల్ఎండీలో ప్రస్తుతం 9.397 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయి. గురువారం నాటికి 10టీఎంసీలకు పైగా నీళ్లు రానున్నాయి.

మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కవిత

విద్యానగర్, ఆగస్టు 28 : ప్రభుత్వ వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పాథలోజి హెచ్‌వోడీ డాక్టర్ కవితను నియమిస్తూ డీఎంఈ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం బాధ్యతలు చేపట్టిన కవితను ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఎస్ఆర్‌లు, సిబ్బంది అభినందించారు.

బీఎల్వోలకు సహకరించాలి

మానకొండూర్ రూరల్, ఆగస్టు 28: కొత్త ఓటర్ల నమోదులో బీఎల్వోలకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని అసిస్టెంట్ ఎన్నికల అధికారి, మానకొండూర్ తహసీల్దార్ రాజేశ్వరి సూచించారు. మానకొండూర్ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఓటర్లకు సంబంధించిన మార్పులు, చేర్పులు ఉంటే కూడా వాటికి సంబంధించిన వివరాలను సంబంధిత బీఎల్వోలకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ నాయబ్ తహసీల్దార్ రాకేశ్, సీనియర్ అసిస్టెంట్ సమీన, గిర్దావర్లు జయలక్ష్మి, ప్రవీణ్ కుమార్, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సుందరగిరిలో సేఫ్టీ కిట్‌పై శిక్షణ

చిగురుమామిడి, ఆగస్టు 28: సుందరగిరి గ్రామంలో కాటమయ్య రక్షణ కవచం (సేఫ్టీ కిట్)పై తిమ్మాపూర్ ఎక్సైజ్ సీఐ బాబా ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కల్లుగీసే క్రమంలో ప్రమాదాలను అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ సేఫ్టీ కిట్‌ను ఎలా ఉపయోగించాలో గీతకార్మికులకు వివరించారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి తిరుపతి గౌడ్, మండలాధ్యక్షుడు బండారుపల్లి చంద్రం, వివిధ గ్రామ శాఖల అధ్యక్షులు తాళ్లపల్లి సంపత్, బుర్ర తిరుపతి, బత్తిని మల్లేశం, ఆకుల శ్రీనివాస్, గట్టు మొగిలి, జిల్లా నాయకులు శ్రీనివాస్, రాజాగౌడ్, చంద్రయ్య, సంపత్, రాములు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

తెలంగాణచౌక్, ఆగస్టు 28: మానకొండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన మర్రి ఓదెలుయాదవ్, కార్యవర్గ సభ్యులు దాసరి శ్రీనివాస్ యాదవ్, వెల్పొండ రాజుయాదవ్‌ను యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బండి మల్లయ్యయాదవ్ నగరంలోని కార్యాలయంలో బుధవారం శాలువాలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్ పదవీతో పాటు మరో ఇద్దరిని కార్యవర్గ సభ్యులుగా యాదవులను నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవుల సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగా కొమురయ్యయాదవ్, రాష్ట్ర నాయకులు వాసంమల్లేశ్‌యాదవ్, నగర అధ్యక్షుడు కమలాకర్‌యాదవ్, నాయకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఆగస్టు 28: నగరంలోని 11కేవీ ఇండస్ట్రియల్/పద్మనగర్ ఫీడర్‌లో కొత్త డీటీఆర్ బిగింపు పనులు చేపడుతున్నందున గురువారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-2 ఏడీఈ సుధీర్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం12గంటల వరకు పద్మనగర్, ఫ్రొ స్టాప్ ఏరియా, ఇండస్ట్రియల్ ఏరియా, ప్రగతి నగర్, సాయిబాబా టెంపుల్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

చొప్పదండి, ఆగస్టు 28 : పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. పురుగుమందులను కొనుగోలు చేసే రైతులకు రశీదులను అందించాలని సూచించారు. అనంతరం గుమ్లాపూర్ గ్రామంలో పంటలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు.

రుణమాఫీకి స్పెషల్ డ్రైవ్

గంగాధర/ చొప్పదండి/శంకరపట్నం/హుజూరాబాద్ టౌన్, ఆగస్టు 28: రేషన్ కార్డు లేక మూడు విడుతల్లో రుణమాఫీ కాని రైతుల కోసం గ్రామాల్లో ఈ నెల 29 నుంచి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. రుణమాఫీ కాని రైతులు కుటుంబ వివరాలను స్పెషల్ డ్రైవ్‌లో అధికారులకు అందించాలని హుజూరాబాద్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకురాలు జి.సునీత పేర్కొన్నారు. గంగాధర మండలంలో నేటి నుంచి సెప్టెంబర్ 11 వరకు, చొప్పదండి మండలంలో 4వ తేదీ వరకు, శంకరపట్నం మండలంలో సెప్టెంబర్ 11 వరకు అన్ని గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టి రైతు కుటుంబాల వివరాలను ఆన్‌లైన్ చేయనున్నట్లు ఆయా మండలాల ఏవోలు శ్రీనివాస్, వెంకటేశ్, వంశీకృష్ణ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. గ్రామాల వారీగా స్పెషల్ డ్రైవ్ తేదీలను ప్రకటించారు. సంబంధిత తేదీల్లో ఆయా గ్రామాల రైతులు ఆధార్‌కార్డు, సెల్ఫ్ డిక్లరేషన్ పత్రాలతో అందుబాటులో ఉండాలని సూచించారు.

'మా గ్రామాన్ని మూడు ముక్కలు చేయకండి'

శంకరపట్నం, ఆగస్టు 28: తమ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీల పేరిట మూడు ముక్కలు చేయవద్దని మొలంగూర్ గ్రామ పరిధిలో ఉన్న నల్లవెంకయ్యపల్లె, గుడాటిపల్లె గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆ పల్లెలకు చెందిన పలువురు నాయకులు మొలంగూర్‌లో విలేకరులతో మాట్లాడారు. అసలు గ్రామ విభజన కోసం ప్రభుత్వానికి తాము తీర్మానం కూడా పంపలేదని తాజా మాజీ సర్పంచ్ మోరె అనూష-శ్రీనివాస్ వెల్లడించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి, ఉమ్మడి జిల్లా మంత్రి శ్రీధర్‌బాబు స్పందించి, మూడు ప్రత్యేక జీపీలకు సంబంధించిన గెజిట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఫీజు బకాయిలను విడుదల చేయాలి

తెలంగాణచౌక్, ఆగస్టు 28: పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవనంలో బుధవారం నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తామని వాగ్దానం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇప్పటి వరకు కనీసం విద్యారంగం మీద సమీక్ష నిర్వహించలేదని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రిని సైతం నియమించక పోవడంతో విద్యారంగ సమస్యలను ఎవరి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎనిమిది వేల కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయడంలో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ జిల్లాకు కేంద్ర విద్యా సంస్థలను మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఐటీ కోసం కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, కార్యదర్శి మచ్చ రమేశ్, నాయకులు హేమంత్, సందీప్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, శ్రావణ్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్ బేస్‌బాల్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థులు

సీతారామచంద్రస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు

ఇల్లందకుంట, ఆగస్టు 28: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దేవాలయంలో ఉత్సవమూర్తులకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయం ఎదుట ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగించారు. భక్తులు స్వామి వారికి మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఇక్కడ దేవాలయ అర్చకులు శేషం రామాచార్యులు, వంశీధరాచార్యులు, దేవాలయ సిబ్బంది మోహన్, మల్లారెడ్డి, సురేందర్‌రావు, భక్తులు ఉన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్ బేస్‌బాల్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థులు

రామడుగు, ఆగస్టు 28 :గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాల 9వ తరగతి విద్యార్థి అశ్విత్, ఎనిమిదో తరగతి విద్యార్థులు వరుణ్‌తేజ్, స్రవంతి జాతీయస్థాయి సాఫ్ట్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 10న మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జూనియర్ విభాగంలో పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఎంపికైన విద్యార్థులు అక్టోబర్‌లో హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు. కాగా, సాఫ్ట్ బేస్‌బాల్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా. వీ నరేందర్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి లారీలను పట్టుకున్న రెవెన్యూ అధికారులు

గంగాధర, ఆగస్టు 28: గోపాల్‌రావుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని వంటశాల గుట్ట నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న లారీలను బుధవారం మండల రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. వంటశాల గుట్ట నుంచి అనుమతి లేకుండా కొందరు వ్యక్తులు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో రెవెన్యూ సిబ్బంది, మట్టిని తవ్వుతున్న స్థలానికి చేరుకున్నారు. మట్టి తవ్వుతున్న జేసీబీతో పాటు రెండు లారీలను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆర్ఐ రాములు తెలిపారు. కాగా, హరితహారంలో భాగంగా గుట్ట పరిసరాల్లో నాటిన మొక్కలను ధ్వంసం చేసిన లారీ, జేసీబీ యజమానులపై పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'అక్రమ విరాసత్ ఫిర్యాదుపై ఆర్డీవో విచారణ'

శంకరపట్నం, ఆగస్టు 28: వ్యవసాయ భూమి అక్రమ విరాసత్ చేసుకున్నారనే అభియోగం మేరకు హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్ బుధవారం మొలంగూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. కంకణాల జమున అనే మహిళ ఆధార్ కార్డును ఎడిట్ చేసి, తప్పుడు పత్రాలు సృష్టించి పొద్దుటూరి వీరారెడ్డి అనే రైతు వ్యవసాయ భూమిని తన ఇద్దరు కూతుళ్లకు అడ్డ దారిలో విరాసత్ చేసుకున్నదని, వీరారెడ్డి తల్లి శంకరమ్మ, ఇతర కుటుంబ సభ్యులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలతో హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్, శంకరపట్నం తహసీల్దార్ భాస్కర్‌తో కలిసి పొద్దుటూరి వీరారెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులను విచారించారు. అనంతరం నల్లవెంకయ్యపల్లెకు వెళ్లి మంచంపై లేవలేని స్థితిలో ఉన్న శంకరమ్మను సైతం విచారించారు. అలాగే జమునను కూడా విడిగా విచారించి, విచారణ నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు ఆర్డీవో రమేశ్ వెల్లడించారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, రికార్డ్ అసిస్టెంట్ ఇలియాస్ ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

గంగాధర, ఆగస్టు 28: మండల కేంద్రానికి చెందిన షహీద్ పాషా మూడు నెలల క్రితం విద్యుత్ ప్రమాదంలో చేతిని కోల్పోగా, తీవ్రంగా గాయపడ్డాడు. నిరుపేద కుటుంబం కావడంతో పాటు చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పాషాను నాయకుడు తూడి లచ్చయ్య బుధవారం పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుని రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. లచ్చయ్యకు షహీద్‌పాషా కృతజ్ఞతలు తెలిపాడు. కార్యక్రమంలో టీఎల్ యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

3 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

కొత్తపల్లి, ఆగస్టు 28 : కొత్తపల్లి మండల స్థాయి క్రీడా పోటీలు సెప్టెంబర్ 3 నుంచి నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి వేణు కుమార్ తెలిపారు. మండల స్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్) వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశాన్ని బుధవారం అల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్‌లో నిర్వహించారు. ఎస్జీఎఫ్ మండల కార్యదర్శి గిన్నె లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మండల విద్యాధికారి వేణుకుమార్ మాట్లాడుతూ, ఎస్జీఎఫ్ క్రీడా పోటీల్లో భాగంగా 3న అల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్‌లో అండర్-14, 17 బాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, 4న అండర్-14, 17 విభాగంలో బాలురకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు కొనసాగుతాయని తెలిపారు. అలాగే 6న జిల్లా కేంద్రంలోని డా. బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో అండర్-14, 17 విభాగంలో బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రీడాపోటీల్లో పాల్గొనే విద్యార్థులంతా జనన ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలన్నారు.

వీణవంక, ఆగస్టు 28: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో వచ్చే నెల 3 నుంచి మండల స్థాయిలో క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 3న బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ టోర్నమెంట్, సెలక్షన్స్, 6న బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు పీడీ శ్రీనివాస్‌ను 9346120205 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

మానకొండూర్, ఆగస్టు 28: ఎస్‌జీఎఫ్ అండర్ -14, 17 బాలబాలికలకు సెప్టెంబర్ 3,4 తేదీల్లో మానకొండూర్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం మధుసూదనాచారి, ఆర్ నర్సయ్య ప్రకటనలో తెలిపారు. 3న బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, 4న బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి ఆసక్తి గల విద్యార్థులు పాల్గొనాలని సూచించారు.

ఈనెల 30 నుంచి..

కొత్తపల్లి, ఆగస్టు 28 : కరీంనగర్ అర్బన్ మండలస్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలను ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 6 వరకు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి మధుసూదనాచారి, మండల క్రీడోత్సవాల కన్వీనర్ అంతటి శంకరయ్య పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని డా. బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఈనెల 30, 31వ తేదీల్లో బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ టోర్నమెంట్, సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే సెప్టెంబర్ 2 నుంచి 4 వరకు బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ టోర్నమెంట్ కం సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 6న బాల బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయన్నారు. ఇతర వివరాలకు కన్వీనర్ శంకరయ్యను 9849114956 నంబరులో సంప్రదించాలన్నారు.

అక్రమంగా పశువుల తరలింపు

- సినీఫక్కీలో పట్టుకున్న పోలీసులు

తిమ్మాపూర్, ఆగస్టు 28: ట్రక్కులో అక్రమంగా తరలిస్తున్న పశువులను సినీ ఫక్కీలో పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. తిమ్మాపూర్ సీఐ స్వామి ఆదేశాల మేరకు చిగురుమామిడి ఎస్ఐ రాజేశ్ రేణికుంట టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కాటారం నుంచి హైదరాబాద్ షాద్‌నగర్‌కు ఓ ట్రక్కు వెళ్తుండగా, పోలీసులను చూసిన డ్రైవర్ తప్పించుకుని అధిక వేగంతో వెళ్లాడు. అప్రమత్తమైన ఎస్ఐ రాజేశ్ ట్రక్కులో పశువులున్నట్లు గుర్తించి, వాహనాన్ని అడ్డుకునే ప్రయత్నం చేసినా ఆపలేదు. పోలీసులను చూసి ట్రక్కు డ్రైవర్ మరింత స్పీడ్‌గా వెళ్లడంతో సిద్దిపేట జిల్లా బెజ్జంకి పోలీస్‌స్టేషన్, ఇతర పోలీసులు ఆపే ప్రయత్నం చేసినా ఆపలేదు. అయినా వెనక్కి తగ్గని పోలీసులు సిద్దిపేట జిల్లా గౌరారం పోలీస్‌స్టేషన్ వద్ద ట్రక్కును పట్టుకున్నారు. అనంతరం వాహనాన్ని తనిఖీ చేయగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం సమీప ప్రాంతాల్లో కొనుగోలు చేసిన 24ఎడ్లు, నాలుగు ఆవులు ఉన్నాయి. డ్రైవర్ ఆసిఫ్, సమీర్‌ను అదుపులోకి తీసుకొని వాహనాన్ని ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరితో పాటు ఉన్న సాహిద్ తప్పించుకున్నాడు. వీరిని విచారించగా యజమాని సద్దాం సూచన మేరకు వాహనంలో పశువులను తరలిస్తున్నట్లు ఒప్పుకొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి మరింత మంది ప్రమేయం ఉంటే చర్యలు తీసుకుంటామని ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు తెలిపారు. మేత పెట్టకుండా ఒకే ట్రక్కులో తరలించడంతో అస్వస్థతకు గురైన పశువులకు పశు వైద్యురాలు చికిత్సనందించారు.